
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7, కనిష్ఠం 23.7
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 6 ఆగస్టు 2024





ఇష్టారాజ్యంగా నిధుల వినియోగం!



- జిల్లాలో పలు గ్రాంట్‌ల నిధులను దారిమళ్లించినట్లు గుర్తించిన ఆడిట్ శాఖ
- మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై పారదర్శకత లేదని నివేదిక
- గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులకు పథకాల నిధులు మళ్లింపు
- పంచాయతీలు, మున్సిపాలిటీలు, మార్కెట్ కమిటీల్లోనూ అదే తీరు
- నిధుల వినియోగంపై కీలకమైన నివేదిక ఇచ్చిన ఆడిట్ శాఖ

నిజామాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఆడిట్ శాఖ ఇచ్చిన నివేదిక జిల్లాలో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నిధులు ఇష్టారాజ్యంగా ఖర్చుచేశారు. కొన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే నిధులను ఇతర పనులకు వినియోగించారు. పలు పథకాలకు నిధులు వచ్చినా వాటిని ఈ వినియోగమైన నిధులకు మళ్లించలేదు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు బోధన్ మున్సిపాలిటీలో రోజువారి పన్నుల వసూలు చేసిన వాటిని జమచేయలేదు. వ్యవసాయ మార్కెట్‌లలో కొన్ని నిధులను ఎలాంటి అనుమతులు లేకుండానే ఇతర పనులకు వినియోగించారు. జిల్లాలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన నిధులపై రాష్ట్ర ఆడిట్ శాఖ విడుదలచేసిన నివేదికలో పలు అంశాలను పొందుపరిచారు. పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో నిధుల వినియోగంపై పలు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. నిధులు మళ్లించి ఏళ్లు గడుస్తున్నా వాటిని తిరిగి వినియోగంలోకి తేలేదని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

కీలక అంశాలను పొందుపర్చిన ఆడిట్‌శాఖ

జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా గ్రంథాలయ శాఖపై రాష్ట్ర ఆడిట్‌శాఖ కీలకమైన అంశాలను పొందుపర్చింది. జిల్లాలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులు, నిధుల వినియోగం, నిధుల దారిమళ్లింపు అన్ని జిల్లాలతో పాటు ఈ జిల్లాలోని వినియోగంపై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పలు అంశాలను పొందుపర్చారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్నుల వసూలు, సీనరేజీ పనులకు చెల్లింపుల్లో నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన దానికన్నా.. ఎక్కువ మొత్తంలో చెల్లించినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు చేపట్టినా కొంతమంది బిల్లు కలెక్టర్లు డబ్బులు వసూలు చేసి కార్పొరేషన్‌లో జమచేయనట్లు రిసిప్ట్‌ల ఆధారంగా గుర్తించారు. వారి నుంచి రికవరీ చేయాలని కమిషనర్‌ను కోరినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు సీనరేజీ డబ్బులు ఎక్కువ చెల్లించినందున వారినుంచి కూడా వసూలు చేయాలని నివేదికలో పొందుపర్చారు. ఇవేకాకుండా పలు పనులకు సంబంధించి నిబంధనలకు అనుగుణంగా చెల్లింపు చేయలేదని, వేరే పనులకు నిధులు మళ్లించి తదుపరి ఈ పద్దులకు నిధులు జమచేయలేదని పేర్కొన్నారు. బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఉద్యోగులకు సంబంధించి నిర్ణీత సమయంలో చెల్లించలేదని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆలస్యంగా చెల్లించడం వల్ల ఆ బకాయిలతో పాటు అదనంగా లక్షా 54వేల రూపాయలను చెల్లించారని ఆ డబ్బులను ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని కమిషనర్‌కు సూచించినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో పన్నులు వసూలు చేసినా వాటిని జమచేయలేదని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. ఒక్కరోజు సంబంధించి 20వేలు వసూలు కాగా రిసిప్టులు ఉన్నా మున్సిపాలిటీ ఆకౌంట్‌లో డబ్బులు జమ చేయలేదని రిపోర్టులో పేర్కొన్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీలోను చెల్లింపులు ఇదే విధంగా చేశారని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. మున్సిపాలిటీలో పన్నుల వసూలు చేస్తున్నా సక్రమంగా చూపడం లేదని జిల్లాకు సంబంధించి ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు.

ఉపాధిహామీకి నిధుల మళ్లింపు

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు వివిధ గ్రాంట్‌ల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వస్తున్నాయి. ఈ నిధులను ఆయా పథకాలకు వినియోగించాలి. గ్రామ పంచాయతీలకు అవసరమైన పనులు చేపట్టాలి. కొన్ని గ్రామపంచాయతీ పనుల్లో ఉపాధిహామీ కింద చేపట్టిన పనులకు ఈ గ్రాంట్‌ల కింద విడుదలైన నిధులను మళ్లించినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈజీఎస్ పథకం కింద చేపట్టిన వైకుంఠ ధామాలు, డంపింగ్‌యార్డులు, ఇతర పనులకు ఈ నిధుల నుంచి చెల్లింపులు చేశారు. ఉపాధి హామీ డబ్బులు వచ్చిన తర్వాత ఆ నిధులను గ్రాంట్‌లకు మళ్లించలేదని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. కోటగిరి మండలం సుంకిని గ్రామంలో గ్రాంట్ కింద వచ్చిన 2లక్షల రూపాయలను వైకుంఠ ధామాల పనులకు చెల్లించినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామంలో 3లక్షల 80వేలు వైకుంఠ ధామానికి మళ్లించినట్లు గుర్తించారు. ముప్కాల్ మండలం కొత్తపెల్లి, వేంపల్లి గ్రామాల్లోనూ ఇదే విధంగా నిధులు మళ్లించినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. జిల్లాలోని చాలా గ్రామ పంచాయతీల పనుల్లో వివిధ ప్రాంతం నుంచి వచ్చిన నిధులను అనుమతులు లేకుండానే ఇతర పనులకు మళ్లించినట్లు రాష్ట్ర ఆడిట్ రిపోర్టు పేర్కొన్నారు. ఈ విషయాలను జిల్లా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పూర్తిస్థాయి స్పందన రాలేదని నివేదికలో పేర్కొన్నారు. ఇదే రీతిలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నిధుల మళ్లింపు జరిగిందని ఆడిట్ అధికారులు గుర్తించారు. కొన్ని పనులకు అనుమతులు లేకుండానే నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులను నిధులను వాపసు తీసుకొచ్చి షెడ్యూల్‌లోని పనులకు కేటాయించాలని కోరినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇదేవిధంగా గ్రంథాలయ సంస్థ పనుల్లోనూ వచ్చిన నిధుల కంటే ఎక్కువగా ఖర్చు చేసినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు. జిల్లాలోని ఈ శాఖల్లో పూర్తిస్థాయి ఆడిట్ రిపోర్టును ప్రభుత్వానికి అందించారు. జిల్లాలో 2020-21 ఆర్థిక సంవత్సరంలోనే పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు జరిగిందని, తర్వాత సంవత్సరాల్లో ఇదే రీతిలో జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మున్సిపాలిటీల్లోని పన్నుల వసూళ్లపై పూర్తిస్థాయి జవాబుదారి తనం తీసుకురావాలని ఆడిట్ రిపోర్టులో పేర్కొన్నారు.



మోటార్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్

తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, ఆగస్టు 5: రక్షిత మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించేలా తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి బోధన్ పట్టణంలోని వాటర్ ఫిల్టర్ బెడ్ పంప్‌హౌస్‌తో పాటు వివిధ ప్రాంతాలలో గల మంచినీటి ట్యాంకులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఫిల్టర్ బెడ్‌లోని నీటిని శుద్ధి చేస్తున్న విధానాన్ని పంప్‌హౌస్‌ల పనితీరును ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డులు, వాటర్ పైప్‌లైన్ తదితర వాటిని తనిఖీ చేశారు. వాటర్ ట్యాంక్‌లు, పంప్‌హౌస్ నిర్మాణాల కోసం ప్రతిపాదించిన స్థలాలను ఎమ్మెల్యే, కలెక్టర్ సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. అనంతరం ఇరిగేషన్ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈఈ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కస్తూర్బా పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నందిపేట, ఆగస్టు 5: అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదులు, డార్మేటరీ, డైనింగ్‌హాల్, కిచెన్, స్టోర్‌రూంలను పరిశీలించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగాన 8వ తేదీన పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. పాఠశాలలో అందరికి కనిపించే విధంగా మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రిన్సి పాల్ శాంతికుమారిని ఆదేశించారు. అంతకు ముందు అయిలాపూర్‌లోని ఎస్సీబాలుర వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన పాత భవనం స్థానంలో రూ.2.4కోట్ల అంచనా వ్యయంతో భవనం నిర్మించాలని, రూపొందించిన ప్రతిపాదనలను ఎంత వరకు వచ్చాయని ఈఈ దేవదాసును అడిగితెలుసుకున్నారు. నిజామాబాద్, నందిపేట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలను కలెక్టర్ పలకరించారు. వారితో కలిసి మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి జగన్నథచారి, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



- కంఠేశ్వర్ ఆలయంలో భక్తుల క్యూ

శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం శ్రావణ మాసం ప్రారంభం కావడంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మహిళలు ఉదయం నుంచే ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు చేశారు. శుభాలు కలిగే మాసంగా శ్రావణ మాసానికి పేరుండడంతో భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, జెండాబాలాజీ ఆలయం, శంబునిగుడి ఆలయం, మార్కెండేయ మందిర్, మాధవనగర్ సాయిబాబ ఆలయం, సారంగపూర్ హన్మాన్‌మందిరం, గోల్‌హన్మాన్ తదితర ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. - నిజామాబాద్‌అర్బన్



- శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

- తారచంద్ నాయక్‌ను వరించిన పదవి
- రసవత్తరంగా సాగిన ఎన్నిక ప్రక్రియ



తారచంద్ నాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న అధికారులు

ఖిల్లా, ఆగస్టు 5: ఇందూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్‌గా బి.తారచంద్‌నాయక్ ఎన్నికయ్యారు. సోమవారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నిక రసవత్తరంగా సాగింది. చైర్మన్ పదవి కోసం గాంధారి సొసైటీ చైర్మన్ పి.సాయన్న, రాంపూర్ సొసైటీ చైర్మన్ బి. తారచంద్ నాయక్‌లు నామినేషన్లు వేశారు. ఇద్దరు తమకే పదవి దక్కుతుందని ధీమాలో ఉన్నారు. అయితే తారచంద్‌నాయక్ అనుచరులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వద్దకు వెళ్లగా.. సాయన్న మాత్రం సొసైటీ కార్యాలయంలోనే ఉన్నారు. చివరకు అధినాయకత్వం ఆదేశాల మేరకు సాయన్న తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో.. తారచంద్‌నాయక్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం తారచంద్ నాయక్ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఐడీసీఎంఎస్ చైర్మన్ పదవి మొదటిసారి గిరిజనులకు దక్కిందన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా అందరి మన్ననలు పొందే విధంగా విధులు నిర్వహిస్తానని చెప్పారు. తనకు ఈ పదవి దక్కడానికి కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



పీడీఎస్‌యూ కలెక్టరేట్ ముట్టడి

- స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

నిజామాబాద్ అర్బన్ ఆగస్టు 5: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిరాజ్ కళాశాల నుంచి విద్యార్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు నరేందర్, గణేష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌లు బిల్లులు విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న విద్యార్థులు అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అప్పులు తెచ్చి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకొని పోతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అషోర్, అనిల్, చందు, నిఖిల్, మైహిపాల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు తొలగనున్న విద్యుత్ భారం



కోటగిరి, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని వాటికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలకు గుదిబండలా మారిన విద్యుత్ భారం నుంచి ఉపశమనం కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు. ఈ విధానం అమలైతే ప్రతినెలా స్థాయిని బట్టి ఒకొక్క పాఠశాలకు రూ.300నుంచి 2వేల రూపాయల వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గిపోనుంది. ప్రాథమిక పాఠశాలల్లో 2 లేదా మూడు గదులు, వరండాలు ఉంటాయి. గతంలో కేవలం లైట్లు మాత్రమే ఉండేవి. మన ఊరు, మన బడి పథకం వచ్చిన తర్వాత తరగతి గదుల్లో ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు. గది విశాలంగా ఉంటే రెండేసి ఫ్యాన్‌లు అమర్చారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదు బల్బులు, నాలుగు ఫ్యాన్‌లు పని చేస్తున్నాయి. కొన్నిచోట్ల బోరు మోటార్‌లు ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో నాలుగు నుంచి ఆరు తరగతి గదులు ఉంటున్నాయి. ఇక్కడ ప్రతి నెలా విద్యుత్ బిల్లులు 500రూపాయల నుంచి 800రూపాయల వరకు వస్తున్నాయి. జిల్లా పరిషత్ పాఠశాలల్లోనూ గదుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో రెండేసి మీటర్లు ఉన్నాయి. తాగునీటి బోరు, శుద్ధ జల ప్లాంట్లు పని చేస్తున్నాయి. ఇటీవల డిజిటల్ తరగతులను ఏర్పాటు చేశారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రతి జిల్లా పరిషత్ పాఠశాలకు 1500 నుంచి 2వేల వరకు బిల్లులు వస్తున్నాయి. ప్రతి నెల కనీసం జిల్లావ్యాప్తంగా లక్షలాది రూపాయలకు పైగా నిధులు విద్యుత్ బిల్లుల కోసం ఖర్చు చేస్తున్నారు.

సీఎం నిర్ణయంపై పలువురి హర్షం

ఆ నిధులతో ఇతర పనులు

ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ఏటా నిధులను అందజేస్తుంది. పాఠశాల స్థాయిని బట్టి రూ.10వేల నుంచి రూ.80వేల వరకు నిధులు వస్తున్నాయి. కొన్ని పాఠశాలలకు ఈ డబ్బులు విద్యుత్ బిల్లుల చెల్లింపులకే సరిపోయేవి. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు నిధులు విడుదల కాలేదు. ప్రస్తుతం నిర్వహణ కోసం ప్రధానోపాధ్యాయులు తమ జేబుల్లోంచి తీసి ఖర్చు పెడుతున్నారు. ఇప్పుడు ఉచిత విద్యుత్ సరఫరా ప్రకటన మూలంగా ప్రధానోపాధ్యాయులకు కొంత మేర భారం తగ్గనుంది. విద్యుత్ కోసం వెచ్చిస్తున్న నిధులను పాఠశాలల్లో ఇతర చిన్నచిన్న అవసరాల కోసం ఉపయోగించవచ్చు.

పొదుపుగా వాడుకుంటాం..

:శ్రీనివాస్ రావు, జడ్పీహెచ్ఎస్, కోటగిరి



ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌ను పొదుపుగా వాడుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. లైట్లు, ఫ్యాన్‌లు అనవసరంగా వేయకుండా విద్యుత్ దుబారను అరికడతాము. సీఎం పాఠశాలల విద్యుత్ భారం తొలగించడం హర్షనీయం. తాము చెల్లించే విద్యుత్ బిల్లుల మొత్తాన్ని పాఠశాల అభివృద్ధికి వెచ్చించే అవకాశం కలుగుతుంది.






అర్హులకు డబుల్ బెడ్‌రూమ్‌లను అందించాలి

బోధన్‌రూరల్, ఆగస్టు 5: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో నిర్మించి ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన వారికి కేటాయించాలని సోమవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. కొంతమంది గ్రామస్థులు నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి వెళ్లి సాయంత్రం వరకు అక్కడే ఉండిపోయారు. ఎవరు రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌లు నిరుపయోగంగా ఉన్నాయని అర్హులైన వారికి కేటాయించాలని వారు కోరారు.





ఎస్సారెస్పీలోకి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


మెండోర, ఆగస్టు 5: మహారాష్ట్ర విష్ణుపూరి, బాలీగావ్ ప్రాజెక్టుల నుంచి భారీగా మిగులు జలాలను దిగువకు కొనసాగుతుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి 16229క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుందన్నారు. ఉదయం ప్రాజెక్టులోకి 15418క్యూసెక్కుల వరద రాగా మధ్యాహ్నం 13167క్యూసెక్కులకు వరద తగ్గింది. దీంతో సాయంత్రం వరద కాస్త పెరిగి 16వేల క్యూసెక్కులకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.5 టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1080.1అడుగులు (45.161 టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మోస్రా, ఆగస్టు 5: మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా క్షయ నిర్మూలన అధికారి దేవి నాగేశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక కేంద్రానికి వచ్చిన ప్రతీ ఒక్కరిని టీబీ లక్షణాలు గురించి అడగాలని ఎవరైనా దగ్గుతో బాధ పడుతున్నట్లయితే వెంటనే తెమడ నమూనాలను సేకరించి పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్య అధికారి విజయ్ కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి గౌడ్, ఘనరాజ్, సూపర్‌వైజర్ సాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నికాల్‌పూర్‌లో దొంగల హల్‌చల్

డొంకేశ్వర్, ఆగస్టు 5: మండలంలోని నికాల్‌పూర్ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున దొంగలు మూడు ఇళ్లు, ఒక్క బెల్టుషాపుల్లో చోరీకి పాల్పడ్డారు. ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి నగదును ఎత్తుకెళ్లారు. మిగతా రెండు ఇళ్లలో చోరీకి యత్నించగా ఏమి దొరకకపోవడంతో వెనుతిరిగారు. మద్యం షాపుల్లో మద్యాన్ని దొంగలించారు. మత్తులో ఉన్న దొంగ ఊరచివర పడిపోయి ఉండాన్ని గమనించిన స్థానికులు అనుమానం వచ్చిన గ్రామస్థులు అతడిని విచారించగా ముగ్గురు గ్రామంలో దొంగతనానికి పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. దీంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు.






















బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పురోహితులు

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గణేష్ మహరాజ్ శ్రావణ మాసం విశిష్టతను భక్తులకు వివరించారు. శ్రావణ మాసం మొదటి రోజు సోమవారం రావడం సోమవారం శివుడికి మహ ప్రీతిదాయకమైన రోజు అని శ్రావణ మాసంలో ఐదుసార్లు శ్రావణ సోమవారాలు వస్తాయని, ప్రజలు నిష్టగా ఉంటు ఉపవాసాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికాంత్ చారి, కమిటీ నిర్వాహకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

● సిద్దులగుట్టపై శ్రావణమాసం ప్రత్యేక పూజలు

పెర్కిట్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపైకి శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పోటేత్తారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు భక్తిగీతలు ఆలపిస్తూ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి. వినయ్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు సిద్దులగుట్టపై శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన నవగ్రహల మందిరం, భక్తుల సౌకర్యార్థం రెండు కాటేజీల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డి.సుమన్, పీసీగంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, ప్రశాంత్ గౌడ్, బోండ్ల ఆనంద్, చెందేసి శ్రీనివాస్, కొంతం మురళి, బోండ్ల సంతోష్, అజారి సతీష్, బట్టు శంకర్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు, మహిళ భక్తులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అడ్కాస్‌పల్లి లింగమయ్య, కారేగాంలోని మహ దేవుని ఆలయం, పొతంగల్, ఎత్తొండ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.





నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు


నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బోధన్‌రూరల్,ఆగస్టు5: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్దరణకు ప్రభుత్వం నిధులు కేటాయించి యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం బోదన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ గేటు ఎదుట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీని ప్రభుత్వ అధీనంలోకి తీసుకుని నడిపిస్తామని హామీ ఇచ్చి వాటిని విస్మరించారని, ఫలితంగా గత ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో ఉన్న రైతులను, కార్మికులకు మాయమాటలు చెప్పి నమ్మించి అధికారంలోకి వచ్చారు తప్ప ఫ్యాక్టరీ పునరుద్దరణకు చర్యలు చేపట్టకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. గత 8సంవత్సరాలకు పైగా ఇందులో పని చేసిన కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా లేఆఫ్ ప్రకటించడంతో అనేక మంది కార్మికులు అర్థకలికి గురైన ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఫ్యాక్టరీ పునరుద్దరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు బడ్జెట్‌లో కేటాయించలేకపోయాడని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు శంకర్ గౌడ్, వెంకటేష్, ఏశాల గంగాధర్, నన్నేసాబ్, గంగాధరప్ప, కుమారస్వామి, గోపి, గంగాధర్, తదితరులున్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ధర్నా



కమ్మర్‌పల్లిలో ధర్నా చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఆరుగ్యారెంటీ పథకాలను అమలుపర్చాలని డిమాండ్ చేస్తు సోమవారం కమ్మర్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐఎంల్ మాస్ లైన్(ప్రజాపపంథ) నాయకులు ధర్నా చేపట్టారు. నిరుపేదలు ఇడ్ల స్థలాలు, రేషన్ కార్డులు, ఇండ్లు తదితర అనేక సమస్యల పరిస్కారం కోసం ఎల్లతరబడి ఎదురు చూస్తున్నారని, హామీలిచ్చిన గత ప్రభుత్వాలు వారిఆశాలపై నీల్లుజల్లారని ప్రస్తుత ప్రభుత్వంపై నిరుపేదలు కోటిఆశాలు పెట్టుకున్నారని వీరి బాదలను ఇప్పటికైనా అర్థంచేసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైనవారందరికి రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, డబుల్‌బెడ్‌రూంలు, పెన్షన్‌లు ఇవ్వాలని, రైతాంగ రుణాలు రద్దుచేసి అర్హులైన వారందరికి కొత్తగా రుణాలు అందజేయాలని, సాగుదారులందరికి రైతుభరోసా పథకం వర్తిప జేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, ధరణి సమస్యలు తక్షణమే పరిష్కరించి రైతులను ఆదుకోవాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి అంజేయాలని, భవన నిర్మాణ, అసంఘటిత, కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులతతో కూడిన కనీస వేతనాలు అమలు పర్చాలని, స్కాలర్‌షిప్, ఫీజ్ రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల బకాయిలు చెల్లించాల,నిరుద్యోగ ఖాళీలపై స్వేతపత్రం ప్రకటిస్తూ జాబ్ క్యాలండర్ విడుదలచేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు ఆర్ఐ గంగారాంకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంల్ మాస్ లైన్(ప్రజాపపంథ) నాయకులు సారాసురేష్, అశోక్‌కిషన్ సత్యనారాయణ, రాజేశ్వర్, గంగాధర్, మహమ్మద్, దోస్తలీ, ఎం.సురేష్, కిషన్ తదిరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని కల్లూర్‌లో రైతుల ఆందోళన


కల్లూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

కోటగిరి,ఆగస్టు5: ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన అధికారుల తప్పిదాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు దిగారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో కెనరా బ్యాంకు, పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. రెండు విడతల్లో సుమారు 50మంది రైతులు రుణమాఫీ అర్హత సాధించలేకపోయారు. ఆధార్ కార్డులలో బ్యాంకు ఖాతాలలో ఒకే రకమైన పేర్లు లేకపోతే తమ తప్పిదమా అని రైతులు ప్రశ్నించారు. రుణాలు ఇచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని మాఫీ సమయంలో తమను ఇబ్బందులకు గురి చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కెనరా బ్యాంకులో అధికారులను ఈ విషయమై నిలదీశారు. విషయం తెలుసుకున్న ఏవో శ్రీనివాస్ రావు ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రుణమాఫీ అర్హత సాధించని రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, పీరుగొండ, గంగారాం, సాయిలు, మధుకర్, హన్మాండ్లు, సాయబోయి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌తో రాయకూర్ గ్రామస్థుల వాగ్వాదం

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రుద్రూరు, ఆగస్టు 5: ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండానే పట్టా మార్పిడి చేయడంపై రుద్రూరు తహసీల్దార్ వెంకేటశ్వర్లుపై రాయకూర్ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తంచేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులు రాయకూర్ గ్రామస్థులతో ఆందోళన చేపట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్ గ్రామానికి చెందిన కుర్మ అబ్బయ్య అనే వ్యక్తికి తల్లితో పాటు ముగ్గురు సోదరీణులు ఉన్నారు. ఇటీవల తల్లి మృతి చెందింది. అయితే అబ్బయ్య తల్లి పేరు మీద ఉన్న 22 గుంటల పట్టా భూమిని తన సోదరీమణులకు ఇస్తానని గ్రామస్తులందరి ముందు ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. రాసి ఇచ్చిన 15 రోజులలోనే తహసీల్దార్ వద్దకు వెళ్లి సోదరీమణులకు ఇస్తానన్న భూమిని తన పేరున పట్టా చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆడ బిడ్డలు గ్రామస్తులతో కలిసి అబ్బయ్యను నిలదీయగా ఇచ్చేదేమి లేదన్నాడు. తహ సీల్దార్ వెంకటేశ్వర్లు కనీసం కుటుంబ సభ్యులు ధ్రువీకరణ పత్రం లేకుండా ఎలా పట్టా చేస్తారని తహసీల్దార్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొరపాటున జరిగిందని, పట్టా కాకుండా హోల్డ్‌లో పెట్టి ఆ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేయిస్తానని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కానియెడల మళ్లీ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బాధితులు, రాయకూర్ గ్రామస్థులు హెచ్చరించారు.

జీవన భృతి అందించాలని ధర్నా

నవీపేట,ఆగస్టు5: నెలకు రూ.4వేల చొప్పున తమకు జీవన భృతిని అందించాలని కోరుతూ సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం ద్వారా తమకు రూ.4వేల చొప్పున జీవన భృతి అందించాలని వారు డిమాండ్ చేశారు. తమతో పాటు ప్యాకర్లు, నెలసరి ఉద్యోగులు, బీడీ కమీషన్‌దారులకు సైతం జీవన భృతిని అందించాలని వారు కోరారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు మండల కేంద్రంలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోటగిరి,ఆగస్టు5: మధ్యాహ్న భోజన అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సర్వశిక్ష అభియాన్ ఏఎంవో జీవన్ హెచ్చరించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఏఎంవో తనిఖీ చేశారు. విద్యార్థులకు కారంతో కూడిన భోజనం పెట్టిన విషయం తెలిసిందే. మరోమారు ఇలాంటి చర్యలు పునరావృతం కారాదని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రావు, ఉపాధ్యాయులు విజయ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దు

మోస్రా,ఆగస్టు5: మండలంలోని మోటాడిరెడ్డి కల్యాణ మండపం వద్ద ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణకుమార్ వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేని యెడల జరిమాన విధించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. చిన్న పిల్లలతో ఏదేని పని నిమిత్తం ద్విచక్ర వాహనాలపై పంపిన తల్లిదండ్రులపై కేసులు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల సమక్షంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుకు నిలిచిన నరేంద్ర మోదీ, మాదిగ రిజర్వేషన్‌ల కొరకు సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడి పాపన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యాసాగర్, బీజేపీ నాయకులు సిర్ప సుదర్శన్, ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సోదరులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

● సీడీపీవో జానకమ్మ


చిన్నారికి అన్న ప్రాసన చేస్తున్న సీడీపీవో

రుద్రూరు, ఆగస్టు 5: నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో శ్రేయస్కరమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో జానకమ్మ పేర్కొన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయని, అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటుందన్నారు. ప్రతి మహిళ తమ శిశువులకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చే చిన్నారులకు తల్లిపాల వారోత్సవాల పట్ల కలిగే లాభాలపై తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డీవో సురేష్ బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలత, పీహెచ్‌సీ వైద్యురాలు అయేషా సిద్దికా, ఏపీఎం భా స్కర్, సూపర్ వైజర్లు రవి, సుమతి, పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు. బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మహంతంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు శివరాజవ్వ, శకుంతల, పద్మ, సునంద, స్వప్న తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బోధన్‌రూరల్: తల్లిపాలే బిడ్డకు చాలా శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు గంగావేణి, గోపిలక్ష్మి అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని హున్స, అమ్దాపూర్‌తో పాటు పలు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల యొక్క ప్రాధాన్యత, ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. 7నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగామణి గంగాధర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం గంగామణి, లావణ్య, రాధ, కమల, అంగన్‌వాడీ టీచర్‌లు జయలక్ష్మి, సుశీల, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఆగస్టు5: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సోమవారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిచారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ బీడీ కార్మికులు కటాఫ్ డేట్ నిబంధన మూలంగా నష్టపోతున్నారని అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఉన్న వారికి ఇళ్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల ప్రభుత్వం ఉచితంగా అందజేయాలన్నారు. రేషన్ కార్డ్ లేని వారిందరికీ రేషన్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీఈలు అమలయ్యేంత వరకు ప్రజల పక్షాన నిరంతరం పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, ఈర్షద్, సీహెచ్.గంగారాం, శంకర్, సాయిలు, నాగమణి, బీపాషా బేగం, లక్ష్మీబాయి, బాబుమియా, మోహన్, అరుణ్ యాదవ్, సలీం, ప్రజాసంఘాల నాయకులు, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోధన్ ఆర్టీసీ ఆవిర్భావ దినోత్సవం


బోధన్‌డిపో ఆవిర్భావ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ ఆర్టీసీ డిపో ఆవిర్భావ వేడుకలను సోమవారం ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డిపో మేనేజర్ సరిత దేవి కేక్ కట్ చేసి ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1985 ఆగస్టు 5వ తేదీన ప్రారంభించిన బోధన్ డిపో నాటి నుంచి నేటి వరకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రయాణికులకు వారి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడంలో బోధన్ డిపో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పల్లె, పట్టణ ప్రజలకు ప్రయాణ సేవలను అందిస్తూ ప్రయాణికుల మన్ననాలను పొందుతుందన్నారు. ఉద్యోగులు నిబద్దతతో పని చేసి డిపోను మరింత అభివృద్ధి బాటలో ముందుకు నడిపించాలని సూచించారు. ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సంస్థగా ఆర్టీసీ పని చేస్తుందన్నారు. ప్రజలు ఆర్టీసీ ఆదరించాలని మరిన్ని ఎక్కువ సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సీఐ జనాభాయ్, సిబ్బంది లక్ష్మణ్, సూపరిండెంట్ గిరి, భూషణ్, ఏడీసీ రాణి, సూపర్‌వైజర్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్లలో సృజనాత్మకత సాహిత్య కార్యశాల


ఏర్గట్లలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి

ఏర్గట్ల, ఆగస్టు 5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గరిపెల్లి ట్రస్ట్ అలాగే పత్తిపాక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంపిక చేయబడిన 30 పాఠశాలల్లో సృజనాత్మకత సాహిత్య కార్యశాల ఏర్పాటు చేశారని అందులో భాగంగా ఏర్గట్ల పాఠశాలలో ప్రారంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి తెలిపారు. విద్యార్థుల్లో మేధాశక్తికి పెంపొందించడానికి ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలు పండితులు ప్రవీణ్ శర్మ, గంగాధర్, ప్రసాద్, జ్యోతి పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఏర్గట్ల, ఆగస్టు 5: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమస్యలు ఉన్న విద్యార్థులకు మందులను అందజేసి పాఠశాలలోని వంటి గదిని పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉపాధిహామీ సామాజిక తనిఖీ

రుద్రూరు, ఆగస్టు 5 : రుద్రూరు మండలంలో సోమవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రారంభించారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా డీఆర్‌పీ రాజు చిక్కడ్‌పల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఉపాధిహామీ కూలీలు తాము చేసిన పనికి సరిపడా కూలీ వచ్చిందా లేదా అనే విషయాలను ఈ సందర్భంగా అడిగి తెలుకుంటున్నారు. వారం రోజుల పాటు ఈ సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

కోటగిరి,ఆగస్టు5: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ మల్లయ్య ఆధ్వర్యంలో ఇసుక వేలంపాట నిర్వహించారు. మండలంలోని హంగర్గ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 16ట్రిప్పుల ఇసుకను రెండు రోజుల క్రితం సీజ్ చేశారు. ఇసుక వేలంపాటలో ముగ్గురు పాల్గొని 6 వేల రూపాయల దయాకర్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. వేలంలో దక్కించుకున్న ఇసుకను త్వరితగతిన తరలించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు అదుపుతప్పిన కారు

● పలువురికి స్వల్ప గాయాలు

ఖిల్లా, ఆగస్టు 5: నగరంలోని రెండో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వర్నిరోడ్డులో ప్రమాదవశాత్తు కారు టైరు పగులడంతో కారు ఇంట్లోకి చొరబడింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న పలువురికి స్వల్పగాయాలు అయ్యాయి. స్కూటీ ధ్వంసమైంది. సిరాజ్ అనే వ్యక్తి ఓ శుభకార్యానికి వెళ్లి నాగారం వైపు నుంచి వస్తుండగా ప్రమాదవశవాత్తు కారు ముందటి టైరు పేలింది ఈ ఘటనలో కారు అదుపు తప్పింది. బాధితుడు మల్లేషం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి గాయాలు

ఎడపల్లి, ఆగస్టు 5:మండలంలోని పోచారం గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన జక్కు వెంకన్న అనే వ్యక్తిని తన ఇంటి ముందే వీధి కుక్కలు ఒక్క సారిగా మీద పడడంతో ఆయన చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన రెండు మేకలను కూడా వీధి కుక్కలు చంపాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పోచారం గ్రామం చుట్టు పక్కల గుట్టలు ఉండడంతో వేరే గ్రామాల నుంచి కుక్కలను పట్టుకుని, తీసుకు వచ్చి గుట్టలలో విడిచి పెడుతున్నారని అవి మా గ్రామంలోకి వచ్చి దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో ఉన్న వీధి కుక్కల బారినుంచి గ్రామస్థలను,జీవాలను కాపాడడానికి చర్యలు తీసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు.

స్వచ్ఛదనం- పచ్చదనంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలి: అదనపు కలెక్టర్



అంకాపూర్‌లో మొక్కను నాటుతున్న అదనపు కలెక్టర్ అంకిత్



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నవీపేటలో మొక్కను నాటుతున్న ఎక్సైజ్ సీఐ దిలీప్



పిప్రిలో మొక్కను నాటుతున్న ఆర్డీవో రాజాగౌడ్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, పలు వార్డుల్లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో పచ్చదనంపై ర్యాలీలు, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన,వాటర్ ట్యాంకులు, ట్యాంకుల శుభ్రం, అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలల పరిసరాల శుభ్రత, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈకార్యక్రమంలో నిరంతర ప్రక్రియ అన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు,కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● అంకాపూర్ మొక్కను నాటిన అదనపు కలెక్టర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో సోమవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మండల పంచాయతీ అధికారి శ్రీని వాస్, ఎంపీడీవో, ఎంపీవో, ఏపీఎం సురేష్, ఏపీవో గంగారాం, పీఆర్ఏఈ నితిష్, పంచాయతీకార్యదర్శి హారిక, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మాక్లూర్: ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. సచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మాక్లూర్ మండలంలోని అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ అంకిత్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముత్తెన్న, ఎంపీడీవో క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: చెత్త రహిత నగరానికి ప్రజలందరు సహకరించాలని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి బొడ్డెమ్మ చెరువు వరకు నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా నగర మున్సిపల్ కమి షనర్ మంద మకరంద్ మాట్లా డుతూ నగరంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం 60డివిజన్లలో కొనసా గుతుందని అన్నారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్, కార్పొరేటర్లు,అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌రూరల్: రూరల్ మండలంలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని శ్రీనగర్‌లో జెడ్పీ సీఈవో ఉష ప్రారంభించారు..ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఉష, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీవో ఇక్బాల్, ఏపీవో దేవసమీన పద్మ, టీఏలు హరీందర్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు అర్జున్, ఏపీఎం మహేష్ తదితరులు పాల్గొన్నారు

ఇందల్‌వాయి:తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని చంద్రాయన్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఉమ్మడి జిల్లాల ప్రత్యేక అధికారి అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీపీఓ తరుణ్, డీఎల్‌పివో శ్రీనివాస్, తహసీల్దార్,ఎంపీడీవో అనంత్‌రావ్, ఎంపీవో,ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి, ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ప్రతీఒక్కరు స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటిని పెంచి పర్యవరణాన్ని కాపాడాలన్ని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. సోమవారం ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో అధికారులతో కలిసి ఆర్డీవో రాజాగౌడ్ మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గ్రామస్థాయి అధికారులు, అంగన్‌వాడిలు, ఆశవర్కర్‌లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఏపీవో సురేష్, అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాలను మండలంలో అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని పీడీడీఆర్డీవో సాయగౌడ్ అన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, ఎంపివో సదాశివ్, ఏపీఎం కుంట గంగారెడ్డి, ఏపీవో విద్యానంద్, పంచాయితీ కార్యదర్శి శాంతికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, బుచ్చిమల్లయ్య, ప్రసాద్, శేఖర్, ప్రదీప్, ప్రతాప్, గంగాధర్, మహిళ సంఘాల సభ్యులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోపాల్:స్వచ్ఛదనం-పచ్చదనం అనే కార్యక్రమాన్ని మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం పెద్ద ఎత్తున విద్యార్థినీ విద్యార్థులచే అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని మంచిప్ప గ్రామంలో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ప్రభుత్వ జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులచే మానవహారం చేపట్టి,ప్రధాన వీధులగుండా ర్యాలీలనునిర్వహించారు. అలాగే మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్,మోపాల్, ఠాణాకుర్దు, కులాస్ పూర్,చిన్నాపూర్,కంజర్,బాడ్సి, ముదక్‌పల్లి, కాల్పోల్,ఎల్లమ్మకుంట, బైరా పూర్, అమ్రాబాద్, శ్రీరాంనగర్ తండా, తదితర గ్రామాల్లో గ్రామ పం చా యతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం 5వ తేది నాడు గ్రామంలో గ్రామ కమిటీలతో సమావేశం నిర్వహించి కమిటీల సహాయంతో ర్యాలీ నిర్వహించి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను గుర్తించి వాటిని ఐదు రోజులలో పూర్తి చేయుటకు సమస్యలు చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి విజయ్ కుమార్, ఏపీఎం ముఖీమ్, పాఠశాల ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్ సాయమ్మ, గ్రామ కార్యదర్శులు భూమేష్, మహేశ్వరి, ప్రేమ్ కుమార్, రాజేశ్వర్, మండల, గ్రామ కమిటీ సభ్యులు, ఆశాలు, పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, ఎంపీవో మధుకర్, గ్రామస్థులు తదితరులున్నారు.

కోటగిరి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోటగిరి ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చందర్, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శులు ముజాఫర్ బేగ్, చంద్రకాంత్, నాయకులు హెగ్డోలి శంకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం 1వ డివిజన్ ఖానాపూర్‌లో కార్పొరేటర్ కొర్వలలిత, 3వ డివిజన్ గూపన్‌పల్లిలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, 13వ డివిజన్ సారంగపూర్‌లో కార్పొరేటర్ అరూన్, 18వ డివిజన్ ముబారక్‌నగర్‌లో కార్పొరేటర్ మరాఠి యమనలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములుకావాలని మండల ప్రత్యేకఅధికారి నాగరావు కోరారు.రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారి నాగరావు సిరికొండ మండల కేంద్రంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జీ ఎంపీడీవో, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఖిల్లా:రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని 31వ డివిజన్ ఆటోనగర్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని ఎంఐఎం పార్టీ నేత మహ్మద్ మునవర్‌అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్‌సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని మోర్తాడ్, శెట్‌పల్లి, దొన్కల్ గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో భారీర్యాలీలు నిర్వహించిన అనంతరం పలుగ్రామాల్లో మొక్కలు నాటారు. మొక్కలునాటుతామని ప్రతిజ్ఞ చేశారు.ఎంపీడీవో తిరుమల, ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్‌లు, ఏవోలావణ్య, కార్యదర్శులు, నేళ్ల శ్రీనివాస్, సంతోష్, స్వర్ణ, ఆశవర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలో సోమవారం స్వచ్ఛదనం.. పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 9వ తేది వరకు నిర్వహించే కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పంచాయితీ సిబ్బందితో కలిసి అధికారులు ఎడపల్లి గ్రామ పంచాయితీ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ నాయక్, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీవో మన్ మోహన్ శర్మ, పంచాయితీ కార్యదర్శి నాగరాజు గౌడ్, పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని రుద్రూరు మండల ప్రత్యేక అధికారి నిర్మల పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయడానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఇందూరు చంద్రశేఖర్, ఎస్ఐ అప్పారావు, ఏపీవో మనోహర్, ఏపీఎం భాస్కర్, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, షేక్ నిస్సార్, మాజీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట:మండలంలోని పలు గ్రామాలలో సోమవారం అధికారులు మొక్కలు నాటారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కలు నాటారు. నవీపేటలో ఎక్సైజ్ సీఐ దిలీప్ ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రామాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, గంగాధర్ గౌడ్, భానుగౌడ్, సుభాష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్ తదితరులున్నారు.

వర్ని: మండల కేంద్రంలో సోమవారం స్వచ్ఛదనం.. పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సాయిలు, ఎంపీవో మారుతీ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో మొక్కను నాటుతున్న పీడీ డీఆర్‌డీవో సాయగౌడ్



పోతంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మొక్కను నాటుతున్న బోధన్ ఆర్డీవో



మోర్తాడ్‌లో గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు

తపాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మితాబెనర్జీ



సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్

ధర్పల్లి, ఆగస్టు 5: పోస్టల్ తపాలశాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తపాల సిబ్బందికి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సుస్మితా బెనర్జీ సూచించారు. సోమవారం మండలంలోని హోన్నాజీపేట్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో తపాల పథకాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై తపాల పథకాలను వివరించారు. పోస్టల్ శాఖ నిర్వహించే పొదుపు పథకాలు, సుకన్యసమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్లు, గ్రామీణ తపాలబీమా, పోస్టల్ బీమా, బీపీఎఫ్ ఖాతల గురించి ఆమె వివరించారు. తక్కువ డబ్బులతో ప్రమాద బీమా పథకాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తపాల పథకాలపై అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం. వెంకటరామయ్య, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భగవత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం



తిరుపతిలో లభ్యమైన బాలుడు

బోధన్‌రూరల్,ఆగస్టు5: బోధన్ పట్టణంలోని ఇందూర్ మోడల్ పాఠశాల నుంచి గత నెల 26వ తేదీన విద్యార్థి అదృశ్యం కాగా సోమవారం తిరుపతిలో లభించినట్లు కళాశాల యాజమాన్యం కొడాలి కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గత నెల 26వ తేదిన విద్యార్థి తిరుపతి ట్రైన్ ఎక్కి వెళ్లిపోయాడని అతని ఆచూకీ కోసం అనేక కోణాల్లో విచారించగా తిరుపతిలో ఉన్నట్లు సమాచారం అందుకున్నామని, వెంటనే పాఠశాల యాజమాన్యంతో కలిసి అతనిని తీసుకుని బోధన్‌కు వచ్చామని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలియజేశారు. అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రులు తిరిగి తమ బిడ్డను అప్పగించినందుకు పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ లోకల్ కోర్టు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు5: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విద్యుత్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్టు పెర్కిట్ ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. పెర్కిట్, బాల్కొండ, ముప్కాల్, మెండోర మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికై లోకల్ కోర్టును పెర్కిట్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10.30నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మహిళను కాపాడిన యువకులు

నవీపేట,ఆగస్టు5: మండలంలోని యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన మహిళను స్థానిక యువకులు కాపాడారు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం మండలంలోని శివతండాకు చెందిన బానవత్ జ్యోతి అనే మహిళ కుటుంబ కలహాలతో విరక్తి చెంది యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పలువురు యువకులు ఆమెను పట్టుకుని గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారికి అప్పగించారు. మహిళను కాపాడిన నరేష్, ఖలీల్, వినోద్‌లను గ్రామస్థులు అభినందించారు.

ఉరేసుకుని ఒకరి మృతి



శవ పంచనామా చేస్తున్న ఎస్సై

ఎడపల్లి. ఆగస్టు 5: ఎడపల్లి మండలంలోని బాపూ నగర్ గ్రామంలో సోమవారం సాయంత్రం ఉరి వేసుకుని ఒకరు మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాపూనగర్ గ్రామానికి చెందిన రేపాక కుమార్ (33)అను వ్యక్తి ప్రతి రోజు మద్యంతాగేవాడని, సోమవారం తాగివచ్చి ఆటోనడిపే విషయంలో గొడవపడి జీవితంపై విరక్తి చెంది ఇంట్లోకి వెళ్లి లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉరివేసుకునిమృతి చెందాడని, మృతు డి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్‌స్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సిఐ మల్లేష్

ఇందల్‌వాయి, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో సీసీ కెమారాలను సోమవారం సీఐ మల్లేష్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. సుమారు రూ.20వేల ఖర్చుతో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి చేసిన అనిల్‌కుమార్‌గౌడ్ ఆయన అభినందించారు. గౌరారం గ్రామానికి అనిల్ కుమార్‌గౌడ్ బస్‌స్టాండ్‌లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈకార్యక్రమంలో నిజామాబాద్ డీపో డీఎం. సచ్చితానంద,ఇందల్‌వాయి ఎస్ఐ, బస్ స్టాండ్ కంట్రోలర్ దేవిదాస్, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు5: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో సోమవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అలాగే వార్డుల్లో ఇంటింటికి వెళ్లి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లు, మెప్మాఆర్‌పీలు,విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వాయిపాపన్న పోస్టల్‌కవర్ రిలీజ్‌పట్ల హర్షం

నిజామాబాద్‌అర్బన్ ఆగస్టు 5:సర్వాయిపాపన్న పేరిట కేంద్ర ప్రభుత్వం పోస్టల్ కవర్‌ను రిలీజ్ చేయడంపై జిల్లా సర్వాపాపన్నగౌడ్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గౌడ కులానికి చెందిన ధీరుడు తెలంగాణా ప్రాంతంలో బడుగు,బలహీన వర్గాల్లో చైతన్యం తెచ్చి గోల్కొండ కోటను బద్దలు కొట్టిన సర్వాయిపాపన్నకు దక్కిన గౌరవమే ఇది అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇన్ని రోజుల తర్వాత ఆయన ఖ్యాతిని గుర్తించడం అభినందనీయమన్నారు. గౌడ కుల స్థులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని ఆయన ఖ్యాతిని భవిష్యత్తు తరా లకు తెలియజేసేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్నికార్యక్రమాలను చేపట్టాలని కోరారు.

సైబర్ నేరగాళ్ల వలలో మోసపోయిన దుబ్బాక వాసి

ధర్పల్లి, ఆగస్టు 5:మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన గంగధర్ అనే వ్యక్తి సైబర్‌నేరాగాళ్ల చేతుల్లో మోసపోయాడు.తన ఖాతా నుంచి రూ.96766 మాయం కావడంతో పోలీసులను సోమవారం ఆశ్రయించారు. గంగాధర్ ఎన్‌పిసిఐ కస్టమర్‌కేర్ నంబర్ కోసం గూగుల్ లో సర్చ్ చేయగా అట్టి ఫోన్‌నంబర్‌కు సదరు వ్యక్తి ఫోన్ చేయాగా అతని ఖాతా నుంచి డబ్బులు మాయ మైనట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.గంగాధర్ సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకున్న ఆయన ధర్పల్లి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.గుర్తుతెలియని నంబర్లపట్ల మం డల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

కొండాపూర్ హైస్కూల్ టీచర్ సస్పెన్షన్

సిరికొండ ఆగస్టు 5 : కొండాపూర్ హైస్కూల్ జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయురాలు పద్మజాను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెలలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీలో పద్మజాకు కొండూర్ హైస్కూల్‌కు బదిలీ చేస్తూ మొదట ఉత్తర్వులను జారీ చేయడంతో ఆమె కొండూర్ హైస్కూల్లో విధుల్లో చేరారు. మాడిఫికేషన్ పేరుతో జిల్లా విద్యాశాఖ అధికారి జారీ చేసిన రెండో ఉత్తర్వులో కొండాపూర్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలను జారీ చేయగా ఆమె కొండూర్ నుంచి రిలీవ్ కాకుండా ఉండి పోయారు. దీని వల్ల కొండాపూర్ పాఠశాలలో జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భావించిన అధికారి తన ఆదేశాలను బేఖాతరు చేసినందున పద్మజ టీచర్‌ను సస్పెండ్ చేశారని సమాచారం. కొండాపూర్ హైస్కూల్లో చేరక పోవడమే ఆమె చేసిన తప్పిదమని డీఈవో భావించినట్లు తెలుస్తోంది.తనకు అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘాలను ఆశ్రయించినట్లు సమాచారం.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73100	రూ.67,400	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (12.30, 7.15)
: కల్కి (3డీ తెలుగు) (3.30,10.15)
స్క్రీన్-2 : శివం భజే (11.05, 4.50, 7.35,10.20)
: బుడ్డి (1.50)
స్క్రీన్-3 : అరోన్ (హిందీ) (12.40,7.00,10.10)
: అలనాటి రామచంద్రుడు (3.50)
స్క్రీన్-4 : రాయన్ (12.20,6.30)
: తిరగబడరా సామి (3.40)
: బుడ్డి (10.00)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : బుడ్డి (తెలుగు) (1.35, 7.30)
: ఆరోన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.25, 1.30, 10.30)
: రాయన్ (4.50, 7.40)
స్క్రీన్-3 : రాయన్ (1.20, 10.45)
: కల్కి(4.10, 7.30)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: తిరగబడరా సామి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్